క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

చదువుతోనే పిల్లలకు భవిష్యత్తు



వడ్డెమానులో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్: చదువుతోనే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని వడ్డెమాను జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జుబేదాబేగం అన్నారు. గురువారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ 100 శాతం జీఈఆర్ సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, రఫి అమహ్మద్ పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న చాబోలు గ్రామస్తులు



చాబోలు వద్ద నిలిచిపోయిన టిప్పర్లు

జూపాడుబంగ్లా: అధికలోడుతో వెళ్లున్న టిప్పర్లను గురువారం చాబోలు గ్రామస్తులు అడ్డుకున్నారు. నేషనల్‌హైవే రోడ్డు నిర్మాణం పనుల కోసం ప్రతాపరెడ్డి అనే కాంట్రాక్టర్ చాబోలు సమీపంలోని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ అప్రోచ్‌కాల్వ సుద్దబిలుకును గత వారం రోజుల నుంచి తరలిస్తున్నాడు. అధిక లోడుతో నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు తిరుగుతుండటంతో రోడ్లు దెబ్బతినటంతో పాటు ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

హానరరీ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా పువ్వాడ భాస్కర్

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో హానరరీ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా పువ్వాడ భాస్కర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీఓను విడుదల చేసింది. అలాగే పాములపాడు మండలం బానకచర్లకు చెందిన నారాయణ రెడ్డిని, విశాఖపట్టణానికి చెందిన సతిమందారెడ్డిలను కూడా హానరరి వైల్డ్‌లైఫ్ వార్డెన్‌లుగా నియమిస్తూ అటవీశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి నిరబ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. వీరి పదవీకాలం ఏడాది పాటు ఉంటుంది. త్వరలోనే వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు.


నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఆత్మకూరు: పట్టణంలోని రహమత్‌నగర్ సచివాలయం పరిధిలో, మండలంలోని కురుకుంద గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పంట కోతలు చేపట్టండి

కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వేసుకున్న పంటలను రైతులు వెంటనే కోసుకోవాలని ఏఓ కె.మహేష్ సూచించారు.నంద్యాల జిల్లాకు డిసెంబర్ నెల 4,5 తేదీల్లో భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ తెలియజేసిందన్నారు. కావున రైతులు కోతదశకు వచ్చిన వరి, మిరప, మొక్కజొన్న తదితర పంటలను త్వరగా కోసుకోవాలని సూచించారు. అలాగే కోసిన పంటలను వర్షం బారి నుంచి కాపాడుకునేందుకు ధాన్యాన్ని గోడౌన్లలో భద్రపరచుకోవాలన్నారు. కోసిన, కోతపూర్తయ్యి ఆరబెట్టుకున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కాంతారావు

మహానంది: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్రీయ బాలల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు సూచించారు. మండల కేంద్రమైన తిమ్మాపురం లోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలల్లో గురువారం సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వైద్య సిబ్బంది తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎంఈఓ రామసుబ్బయ్య, ఎంపీహెచ్ఈఓ హుస్సేన్ రెడ్డి పాల్గొన్నారు.



కృష్ణాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్



మిడుతూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి



జూటూరులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు



శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నారాయణపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

- పేదల బతుకులు బాగుపడేలా జగన్ పాలన
- గ్రామాల్లో 'వై ఏపీ నీడ్ జగన్'





నందికొట్కూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మాట్లాడుతున్న ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియమారూఫ్

నందికొట్కూరు: రాష్ట్రంలో నవరత్నాల సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో 14, 16, 17వ వార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గత చంద్రబాబు ప్రభుత్వానికి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి గల తేడాను వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. 8వ సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు డీబీటీ-నాన్ డీబీటీ కింద రూ.7,16,85,746, అభివృద్ధి పనులకు రూ.2,36,25,567 (మొత్తం రూ.9,53,11,313) ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం అందించిన లబ్ధి వివరాల బోర్డును సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు అశోక్, అబ్దుల్ రవూఫ్ హామీద్, లాలు, చిన్నరాజు, నాయబ్, చాంద్‌బాషా, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, గఫార్, జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, పీ. రమేష్, డీ. రమేష్ పాల్గొన్నారు.

పేదల చెంతకే సంక్షేమ పథకాలు

ఆత్మకూరు: రాష్ట్రంలో పేద ప్రజల ముంగిళ్లకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారుఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ అన్నారు. పట్టణంలోని గరీబ్‌నగర్ సచివాలయ పరిధిలో పెద్ద పీర్ల వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నారు. సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.18,33,20,928 లబ్ధిదారులకు అందాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు పాణ్యం పార్వతి, బోయలక్ష్మమ్మ, హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వరాల మాలిక్, విజయచౌదరి, రాముడు, మునీర్‌బాషా పాల్గొన్నారు.

కృష్ణాపురం గ్రామంలో:

మండలంలోని కృష్ణాపురం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, జెడ్పీటీసీ శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌కుమార్ , ఎంపీటీసీరామకృష్ణారెడ్డి లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా ప్రతి పథకాన్ని అర్హులైన పేదలందరికీ అందజేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్, హనుమంతరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్ పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా పాలన

మిడుతూరు: అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో సర్పంచ్ చందాపురం భారతి అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. అనంతరం గ్రామ సచివాలయ వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తువ్వా లోకేశ్వరరెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షులు నాగతుల సిరెడ్డి, ఎంపీటీసీ కోటేశ్వరుడు, మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, బైరాపురం సర్పంచ్ ఫణిభూషణ్ రెడ్డి, జేసీసీ కన్వీనర్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేర్చిన ఘనుడు సీఎం జగనన్న

పాములపాడు:ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చిన ఘనుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జూటూరు గ్రామంలో సర్పంచు నాయిని సావిత్రమ్మ అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా జూటూరు గ్రామ ప్రజలకు రూ.13,81,95,176 లబ్ధి చేకూర్చిందని ఈఓపీఆర్డీ శ్రీనివాసులునాయుడు వివరించారు. అంతకు మునుపు సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ- 2 వరలక్ష్మి, సర్పంచులు వరప్రసాద్, నారాయణ, ఉప సర్పంచు సలాం, జేసీఎస్ మండల కన్వీనర్ నాగరాజు, సొసైటీ చైర్మన్లు చౌడయ్య, గడ్డం క్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచు బాలునాయక్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్‌కార్యదర్శి ఎంఏ రజాక్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వెస్ట్రన్‌కాలనీలో పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మళ్లీ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఎంత అవసరమో పార్టీ శ్రేణులతో కలిసి వివరించారు. కార్యక్రమంలో నాయకులు అసాది ప్రవీణ్ దివ్యతేజ, కన్నయ్య, పాపారావు, గౌస్‌మొహిద్దీన్, ఇదాయితుల్లా, బక్కన్న, అనీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

వెలుగోడు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల మతాలు, రాజకీయ పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలని కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లాలం రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, సర్పంచు సర్దార్‌మియ్య, ఎంపీటీసీ పల్లె వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేల్పనూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

జగనన్నతోనే అన్ని వర్గాల వారి సంక్షేమం

మహానంది: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామంలో గురువారం వైఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు అందిన రూ. 13.61 కోట్ల సంక్షేమ లబ్ధికి సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేసు వెంకట రామిరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ముడిమేల పుల్లారెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీటీసీ వెంకటమ్మ, మాజీ జెడ్పీటీసీ చిన్న మద్దిలేటి, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం



మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు రవియాదవ్

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, బిజినవేముల సర్పంచ్ రవియాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో »పల్లెకు పోదాం« కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేశారు. మండలంలో పల్లెకు పోదాం కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యేందుకు కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. వెంకటరెడ్డి, రవీంద్రననాయుడు, వీరేష్, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డా.విజయలక్ష్మి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఆరోగ్యం, పరిశుభ్రతపై జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), రెడ్‌రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైద్యురాలు బి.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వలన మనిషి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అలాగే మహిళలు తమ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే కళాశాలలో అంతర్జాతీయ సాంకేతిక సమాచారం, కంప్యూటర్స్ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, డా.రాజన్న , రెడ్‌రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ ఎస్.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడలకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: ఆడుదాం-ఆంధ్ర క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు అసక్తి ఉన్న క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. గురువారం జూపాడుబంగ్లా సచివాలయం-2లో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 15ఏళ్ల పైబడి వయసు ఉన్న యువతీ, యువకులు క్రీడల్లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకొన్న వారికి ఏఏ క్రీడల్లో పాల్గొనే ఆసక్తి ఉందో వారిని గ్రూపులుగా విభజించి డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 దాకా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్ డబుల్స్ విభాగాల్లో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సత్వరమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే సచివాలయంతో పాటు 1902కు ఫోన్‌చేసి వివరాలు నమోదు చేయించుకోవచ్చునని తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 161మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

మహానంది: పదిహేనేళ్లు నిండిన యువత ఆడుదాం ఆంధ్ర క్రీడల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ శివనాగ జ్యోతి గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడల రిజిస్ట్రేషన్ ప్రారంభం అయిందని చెప్పారు. ఈ అవకాశాన్ని మండలంలోని 15 సంవత్సరాలు నిండిన యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తయ్యే వారు కూడా నమోదు చేయించుకోవాలన్నారు. ఓటు నమోదు పై చైతన్య పరచాలని, ఇది అందరి బాధ్యత అని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఉంటే ఫాం 8 ద్వారా ఒకే బూత్‌లో ఉండేలా సరిచేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో వీఆర్వో ముర్తుజావలి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో విరివిగా పాల్గొనాలి

రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద క్రీడా టోర్నమెంటులో భాగంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర లో క్రీడాకారులు విరివిగా పాల్గొనాలని ఎంపీడీఓ గోపీక్రిష్ణ సూచించారు. అధ్యాపకులు చొరవ తీసుకొని 15 సంవత్సరాలు నిండిన బాల, బాలికలచే రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు.

పాఠశాలలో 20 మంది విద్యార్థుల చేరిక



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈఓ సుభాన్

పగిద్యాల: పదో తరగతి ఫెయిల్ అయి ఇంటి వద్ద ఉన్న 20 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించినట్లు మండల విద్యాధికారి సుభాన్ తెలిపారు. గురువారం మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామంలో ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి జీఈఆర్ సర్వే చేపట్టారు. ఈ నేపథ్యంలో పదో తరగతిలో ఒకటి, రెండు సబ్జెక్ట్‌లలో ఫెయిల్ అయి, పరీక్షా ఫీజు చెల్లించిన 20 మంది విద్యార్థులను గుర్తించారు. వీరిని ఆయా సబ్జెక్ట్‌ల క్లాస్‌లలో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కాసింసాహెబ్, జావేద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేటి నుంచి గరికపాటి ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నుంచి మహాసహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు చే 'శ్రీ భ్రమరాంబాష్టకం' పై ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణమాడవీధిలోని ధర్మపథం వేదిక వద్ద సాయంత్రం 7 గంటలకు ప్రవచన కార్యక్రమం ఉంటుంది. కార్యక్రమంలో ప్రవచకులు శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారి అష్టకం లోని విశేషాలను వివరించనున్నారు.

వీధి లైట్లు, మీటర్లు ఏర్పాటు చేయండి

శ్రీశైలం: శ్రీశైలం సచివాలయం-4లో వీధి లైట్లు, మీటర్లు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం కోరారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో కార్యదర్శి బాలు నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ సున్నిపెంట కాలనీలో చెత్తకుండీలను ఏర్పాటు చేయాలని, జీ టైప్ క్వార్టర్స్ వెనుక డ్రైనేజ్ కాల్వల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేసి డీడీటీ, బ్లీచింగ్ పౌడర్లను చల్లాలని కోరారు. కార్యక్రమంలో వై.శ్రీను, గోపాల్, వెంకటేశ్వర్లు, కులమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాటమయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పగిద్యాల: మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో కేసీ కెనాల్ బ్రిడ్జి సమీపాన నూతనంగా నిర్మించిన ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం గణపతి పూజ, సంకల్పం, పుణ్యాహం, పంచగవ్యం, రక్షా బంధనం, మంటపారాధనలు, సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, దీక్షా హోమము, అంకురార్పణ, జలాధివాసం కార్యక్రమాలు పురోహితులు జగదీశ్వరయ్య జరిపించారన్నారు. డిసెంబర్ ఒకటి ఉదయం ప్రాతఃకాల పూజలు, హోమాలు, మహాస్నపనం, సాయంత్రం హోమాలు, ధాన్యాధివాస-శయ్యాధివాసాలు, 2న యంత్రవిగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠా, కళావాహనలు అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని కార్యనిర్వాహకులు వెల్లడించారు. గ్రామ ప్రజలు కాటమయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

'వికసిత్ భారత్'యాత్రను విజయవంతం చేయండి

జూపాడుబంగ్లా: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా డీఎస్ఓ వెంకటరాముడు పిలుపునిచ్చారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30 నుంచి 2024 జనవరి 5 వరకు యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను కళాజాత బృందాలు పలురకాల కళల ద్వారా ప్రజలకు వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిషప్ సేవలు మరువలేనివి



బిషప్ పుష్పలలితకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ బిషప్ పుష్పలలితమ్మ సేవలు మరువలేనివని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కొనియాడారు. గురువారం పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో బిషప్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆర్థర్‌తో పాటు నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ ఐజక్ వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆమెను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాస్టరేట్-1 సెక్రటరీ ప్రభుదాసు, ట్రెజరర్ స్టీఫెన్, డీసరీ చైర్మన్ జోసెఫ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆమెకు రూ.లక్ష బహుమతిగా అందజేశారు. పాస్టరేట్-2 డీసరీ చైర్మన్ ఇమ్మానియేల్‌బాబు, సామేల్ రత్నరాజు గురువులు జోయెల్, విజయకుమార్, సెక్రటరీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో కొలువైన శ్రీ మహానందీశ్వర స్వామికి కార్తీక మాసం, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గురువారం అన్నాభిషేకం నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు రవిశంకర్ అవధాని, అర్చక, పండిత బృందం ఆధ్వర్యంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అన్నాభిషేకం పూజలు జరిపించారు. పూజల అనంతరం అన్న ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అర్జున శర్మ, ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ గంగిశెట్టి మల్లికార్జునరావు, అన్నాభిషేకం దాతలు హరికిషన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మరకత లింగేశ్వరుడికి..

గాజులపల్లె రైల్వే స్టేషన్ గ్రామంలోని శ్రీ గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని గురువారం అన్నాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనుమర్లపూడి మస్తాన్ రావు ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు.

నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

పగిద్యాల: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలలో భాగంగా గ్రామ సచివాలయాల్లో చేపట్టిన క్రీడాకారుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ సచివాలయం నుంచి 223 మంది క్రీడాకారులను నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఈనెల 13లోగా పూర్తి చేయాలని డిసెంబర్ 15 నుంచే క్రీడా సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ నాగేంద్రయ్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, వీరన్నయాదవ్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీటి దొంగలపై చర్యలు తీసుకోండి



విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

కొత్తపల్లి: అక్రమంగా చెరువులోని నీటిని దొంగలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ సంజీవ రాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు కోరారు. డెడ్ స్టోరేజ్‌లో ఉన్న సింగరాజు పల్లి గ్రామ శివారులో గంగరేగు వాగు చెరువు నుంచి కొందరు ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని అక్రమంగా తరలిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎస్సై హుస్సేన్ బాషా, ఇరిగేషన్ అధికారులకు ఆయకట్టు రైతులతో కలిసి ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో వారు మాట్లాడారు. మండలంలోని సింగరాజు పల్లి గ్రామ శివారులో గంగరేగు వాగు చెరువు నిర్మించి 13 సంవత్సరాలైనా ఇంతవరకూ ఇరిగేషన్ అధికారులు తమ పరిధిలోకి తీసుకోకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. చెరువు నీటిని చాలమంది అక్రమంగా వాడుకుంటున్నారన్నారు. వీరికి ఇరిగేషన్ అధికారులు అండగా ఉంటూ ఆయకట్టు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఇరిగేషన్ అధికారులపై, అక్రమార్కులపై చర్యలు తీసుకొని గంగరేగు వాగు చెరువును ఇరిగేషన్ శాఖలో చేర్చాలని, రైతులకు సాగునీరిచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ఎస్ దాసు, సోమేశ్, రమణ ,రాముడు, మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.